సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలి

వివిధ పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో వున్న కేసులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ పేర్కొన్నారు. -8లో..



ఎంత పని చేశావ్..అమ్మా!

కుమార్తెను చంకనెత్తుకున్న ఆ తల్లి కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. ప్రొద్దుటూరులో జరిగిన ఈ ఘటనలో నెలలపాప మృతిచెందింది. -8లో..

గరిష్టం/కనిష్టం
35.6/16.7

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 16.7 – 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు చాపాడు ఉపాధ్యాయురాలి ప్రాజెక్ట్


నాగలక్ష్మీదేవి

కడప ఎడ్యుకేషన్/చాపాడు: వైఎస్సార్‌జిల్లా చాపాడు మండలం మెరాయిపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన నాగలక్ష్మీదేవి గణితాన్ని సులభంగా ఎలా బోధించాలనే అంశంపై విద్యా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు తయారు చేసిందని, ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైందని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నాగలక్ష్మీదేవి ఇన్నోవేటివ్ పెడగాజి మైక్రో ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టును తయారు చేసి దీక్ష యాప్‌లో అప్‌లోడ్ చేశారన్నారు. 26 జిల్లాల నుంచి 15 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపిక చేయగా వాటిలో ఒకటి మన జిల్లా నుంచి ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. ఉపాధ్యాయురాలు నాగక్ష్మీదేవి, దీక్ష టీమ్‌ను అభినందించారు. https:// diksha. gov.in/play/content/do&3137342483313 9507217406 లింక్‌పై జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు క్లిక్ చేసి దీక్ష ఆప్‌లో లాగిన్ అవ్వాలన్నారు. వీడియోను పూర్తిగా చూసి చివరిలో ఫైవ్ స్టార్ రేటింగ్ ఇవ్వాలన్నారు. దీంతో ఈ ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపిక అవుతుందని అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

షోలాపూర్-తిరుపతి రైళ్ల గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: షోలాపూర్-తిరుపతి-షోలాపూర్ (01437/38) స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ గడువును జూన్ 30వ తేదీ వరకు పొడిగించామని చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష తెలిపారు. ఈ రైలు ఈనెల 17వ తేదీ వరకు రాకపోకలకు గడువు ముగిసిందని, ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా గడువును పొడిగించారని తెలిపారు. షోలాపూర్ జంక్షన్‌లో గురువారం రాత్రి 9.40 గంటలకు బయలుదేరి శుక్రవారం చేరుకుని, అదేరోజు రాత్రి 9.10కి తిరుపతి నుంచి బయలుదేరుతుందన్నారు.

ఈ క్రాప్ వేగవంతం

- 99.97 శాతం ఈ క్రాప్, 93 శాతం ఈకేవైసీ నమోదు
- ముగింపు దశకు చేరుకున్న పంటల నమోదు ప్రక్రియ
- ఈనెల 28 వరకు గడువు


కడప మండల పరిధిలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ (ఫైల్)


కడప అగ్రికల్చర్: వ్యవసాయసాగుకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే) ఏర్పాటు చేసి రైతులకు అన్ని రకాల సేవలను అందిస్తోంది.రైతు భరోసా నగదు నేరుగా వారి ఖాతాలకే జమచేసి సాగుకు సాయం చేస్తోంది. అలాగే అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలను అందించాలనే లక్ష్యంతో ఈ క్రాప్ పేరుతో పంటల వివరాలను నమోదు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఏ రైతు ఏ పంటలు సాగు చేశారు. ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను వ్యవసాయ అధికారులు నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఈ క్రాప్ నమోదు కార్యక్రమం చివరి దశకు చేరుకుంది. ఇప్పటి వరకు ఈ క్రాప్ 99.97 శాతం పూర్తికాగా ఈకేవైసీ మాత్రం 93 శాతం నమోదైంది. ఇందుకు సంబంధించి ఈనెల 28వ తేదీ వరకు గడువు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

- జిల్లాలో అగ్రికల్చర్, హార్టీకల్చర్, సెరికల్చర్‌కు సంబంధించి సాధారణ సాగు విస్తీర్ణం 3,90,000 ఎకరాలుగా ఉంది. రబీ సీజన్‌కు ఇప్పటిదాకా 2,99,800 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో 2,99,650 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు పూర్తయింది. ఇక కేవలం 250 ఎకరాలకు మాత్రమే చేయాల్సి ఉంది.అంటే ఈ క్రాప్‌కు సంబంధించి 99.97 శాతం మేర నమోదు పూర్తయింది. ఈకేవైసీ సంబంధించి అధికారులు 2,77,268 ఎకరాల్లో నమోదు చేశారు. దీంతో 93 శాతం నమోదైంది. మిగతా విస్తీర్ణాన్ని ఈ నెల 28వ తేదీలోగా పూర్తి చేయనున్నారు.

రాష్ట్రంలో 5వస్థానం...

ఈ క్రాప్ నమోదులో వైఎస్సార్ జిల్లా రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచింది. గడువులోగా వందశాతం నమోదు పూర్తి చేసి ప్రథమస్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకోనివారు ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నెంబర్లు భూమికి సంబంధించిన వివరాలు ఇవ్వాలి. వీపీఏలు ఆధార్ బేస్ డేటాను అనుసంధానం చేసి ఈ క్రాపులో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఇవీ ప్రయోజనాలు: పంట నమోదు వల్ల వరదలు, తుపాన్ల సమయంలో పంటనష్టం జరిగితే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది. పంటల బీమా, సున్నా వడ్డీకి పంట రుణాలు కావాలన్నా, రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు తీసుకోవాలన్నా ఈ క్రాప్ నమోదు తప్పని సరి. కౌలు రైతులు దా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు తమ వివరాలు అందజేసి పంట నమోదు చేసుకుని ప్రయోజనాలు పొందవచ్చు.



గడువులోగా పూర్తి చేస్తాం....



జిల్లాలో ఈ క్రాప్ నమోదుకు ఈనెల 28వ తేదీ వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆర్‌బీకేల ద్వారా ఈ కార్యక్రమం పకడ్బందీగా జరుగుతోంది.వరదలు, తుపాన్లు వచ్చినపుడు పంట నష్టం జరిగితే నష్టపోయిన రైతులకు ఈ క్రాప్‌తో ప్రభుత్వ సాయం కచ్చితంగా అందుతుంది. పంటలను సాగు చేసిన ప్రతి రైతు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలి.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

నామినేషన్ వేసి టీడీపీ నాయకులు
నవ్వుల పాలయ్యారు

- జిల్లాలో ఆ పార్టీకి మనుగడ లేదు
- లోకేష్‌కు సీఎం జగన్‌ను విమర్శించే అర్హత లేదు
- ఎన్టీఆర్ తర్వాత టీడీపీని చంద్రబాబు భ్రష్టు పట్టించారు
- వైఎస్సార్ కుటుంబాన్ని వీడి మాజీమంత్రి నామరూపాల్లేకుండా పోయారు
- స్థానిక సంస్థల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.రామసుబ్బారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న పి.రామసుబ్బారెడ్డి

కడప సిటీ : టీడీపీ నాయకులు కొంతమంది స్వతంత్ర్య అభ్యర్థితో నామినేషన్ వేయించి నవ్వుల పాలయ్యారని స్థానిక సంస్థల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన అనంతరం జమ్మలమడుగు వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. దమ్ము, ధైర్యం ఉంటే తమ పార్టీపై పోటీ చేయాలని, స్వతంత్ర్య అభ్యర్థితో నామినేషన్ దాఖలు చేయించి అమాయక ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీ తుడుచుకుపోయిందని తెలిపారు. టీడీపీకి సంఖ్యాబలం లేకపోయినా నామినేషన్ వేయించి నవ్వుల పాలయ్యారన్నారు. టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి నేతృత్వంలో ఇండిపెండెంట్ అభ్యర్థికి దొంగ సంతకాలు పెట్టించారని, ఇది దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఎన్టీఆర్ విలువలతో కూడిన టీడీపీని స్థాపిస్తే, చంద్రబాబు పార్టీని భ్రష్టు పట్టించారన్నారు. గతంలో 23 మంది వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేను టీడీపీలోకి తీసుకుని మంత్రి పదవులు కూడా ఇచ్చారన్నారు. వైఎస్సార్ కుటుంబాన్ని వదిలాక ఆ మాజీమంత్రి నామరూపాల్లేకుండా పోయారని విమర్శించారు. ధైర్యంగా నామినేషన్ వేసే పరిస్థితి టీడీపీకి లేదని, దొంగ సంతకాలతో రూఢీ అయిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 120 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ తన తండ్రి వైఎస్సార్ ఆశయాల సాధన కోసం వ్యతిరేకించి పది సంవత్సరాలపాటు ప్రజల మధ్యనే గడిపారన్నారు. తర్వాత 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపీలు సాధించుకుని రికార్డు సృష్టించారని అన్నారు. అన్ని రంగాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇంతకంటే భారీ మెజార్టీ వస్తుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. అలాంటి వ్యక్తిని పట్టుకుని లోకేష్ ప్యాలెస్ పిల్లి అని పదేపదే మాట్లాడే అర్హత లేదని తెలిపారు. పాదయాత్రకు జనం లేకపోవడంతో డీలా పడి ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని అన్నారు. పులిపులిగా, పిల్లి పిల్లిగానే ఉంటుందని గుర్తించుకోవాలన్నారు. తమకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

పరిహారం.. దరహాసం

- స్టీల్‌ప్లాంట్ భూ నిర్వాసితులకు పరిహారం పంపిణీ
- ఎకరా భూమి ఉన్న వారికి 50శాతంతో డబ్బులు అందజేత


స్టీల్‌ప్లాంట్ నమూనాను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

జమ్మలమడుగు: ఉక్కు నగరానికి బీజం పడింది. 16 ఏళ్ల నాటి కల సాకారం దిశగా అడుగులు పడ్డాయి. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్ గ్రూప్ సారథ్యంలో ఈ నెల 15న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిందాల్ కంపెనీ ఎండీ సజ్జన్ జిందాల్ చేతుల మీదుగా స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభించడానికి శ్రీకారం చుట్టారు. భూములు కొల్పోయిన రైతులకు పరిహారం పంపిణీ జరిగింది. దీంతో భూనిర్వాసితుల మోములో దరహాసం తొణికిసలాడుతోంది. ఇప్పటికే రెండు ఎకరాల భూములు కొల్పోయిన రైతులకు పరిహారం అందించారు. ఎకరా భూమి కొల్పోయిన రైతుల ఖాతాల్లో సైతం డబ్బులు జమ అయ్యాయి. స్టీల్ ప్లాంట్ కోసం పూర్తిగా భూములు కొల్పోయిన వారి వివరాలను సేకరిస్తున్నారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల కృషి ఫలించింది.

2019 డిసెంబర్‌లో శంకుస్థాపన..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తామని ఎన్నికల సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారం వచ్చిన ఆరునెలల్లోనే జమ్మలమడుగు మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె సమీపంలో ఉన్న కన్యతీర్థం వద్ద 2019 డిసెంబర్ 23 వతేదీన శంకుస్థాపన చేసి శిలాఫలకం వేశారు. వెంటనే 3148 ఎకరాలు, మరో 409 ఎకరాల డీకేటీ భూమిని కేటాయించారు.అయితే కరోనా ప్రభావంతో రెండేళ్లుగా పనులు ప్రారంభంకాలేదు. వైఎస్సార్‌స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం డీకేటీ భూములు కొల్పోయిన 178 మంది రైతుల వద్ద నుంచి 391.44 ఎకరాల భూమిని సేకరించారు. ఎకరాకు 7.5 లక్షల వంతున 29కోట్ల 35 లక్షల 80వేల రూపాయలను రైతుల ఖాతాల్లో గతేడాది సెప్టెంబర్ నెలలోనే జమ చేశారు.దీంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

కేబినెట్ సబ్‌కమిటీ ఆమోదంతో మరి కొందరికి...

మండలంలోని రైతులకు 7వ అసైన్డ్ కమిటీలో భూములు కేటాయించారు. అయితే వారికి ఎలాంటి పట్టాలు ఇవ్వలేదు. తమకు కూడా పరిహారం ఇప్పించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిల వద్ద మొరపెట్టుకున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.దీంతో ప్రభుత్వం లబ్ధిదారులకు సైతం పరిహారం అందించేందుకు కెబినెట్ సబ్ కమిటీ అమోదం తెలిపింది. పట్టాలు లేకపోవడంతో వారికి 50శాతంతో పరిహారం అందించాలని నిర్ణయించింది. ప్రతి రైతుకు 3.75లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుంది. 7వ విడతలో 379 మంది రైతులకు 3.75 లక్షల వంతున మొత్తం 14కోట్ల,56లక్షల 46వేల రూపాయలు పరిహారం ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే 250 మందికిపైగా ఎకరా భూమి ఉన్న రైతుల ఖాతాలలో 3.75 లక్షల వంతున డబ్బులు జమ అయ్యాయి.


3,300కోట్లతో మొదటి విడత పనులు...

మొదటి విడత స్టీల్ ప్లాంట్‌పనులు 3,300 కోట్లతో మూడు మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన పనులు ప్రారంభం కానున్నాయి.ఈ ప్లాంట్ 24 నుంచి 30 నెలల్లో పూర్తి చేసి స్టీల్‌ను ఉత్పత్తి చేస్తారు.తర్వాత ఐదువేల కోట్లతో, మూడువేల టన్నుల సామర్థ్యంతో పనులు చేపట్టి వేగంగా ప్రాజెక్టును విస్తరణ చేయనున్నారు.

పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేశాం..



వైఎస్సార్‌స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం డీకేటి భూములు కొల్పోయిన 178 మంది రైతుల వద్ద నుంచి 391.44 ఎకరాల భూమిని సేకరించారు. వారికి ఎకరాకు 7.5 లక్షల వంతున 29కోట్ల 35 లక్షల 80వేల రూపాయలను రైతుల ఖాతాల్లో గతేడాది సెప్టెంబర్ నెలలోనే జమ చేశాం. ఎకరా భూమి కొల్పోయిన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 50శాతం మాత్రమే పరిహారం ఇవ్వడం కోసం వివరాలు సేకరించి పంపించాం. 379 మంది రైతులలో ఇప్పటికే 270 మందికి ఎకరాకు 3.75 లక్షల రూపాయలు ఖాతాల్లో జమ అయింది. మిగిలిన వారికి పరిహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. – జి.శ్రీనివాసులు, ఆర్డీఓ ,జమ్మలమడుగు



రహదారుల భద్రత కోసం సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ విజయరామరాజు


మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : ప్రజల భద్రత మనందరి సామాజిక బాధ్యత అని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధికశాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే మృత్యువాత పడుతున్నారన్నారు. వాహనాల వినియోగం పెరగడంతో రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రోడ్డు ప్రమాదానికి గల కారణాలను, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై విధిగా నివేదికను ఇవ్వాలని ఆదేశించారు.

- కడప నగరంలోని మూడు ఆస్పత్రులకు ఎమెర్జెన్సీ వైద్య సేవలకు అనుమతులు ఇచ్చినట్లు కలెక్టర్ వివరించారు. రోడ్డుప్రమాదాల్లో గాయపడిన వారికి అన్ని సమయాల్లో అత్యవసర చికిత్సలు అందించేందుకు హోలిస్టిక్, సన్‌రైజ్, హిమాలయ ఆస్పత్రులకు అనుమతులు ఇచ్చామన్నారు. ప్రమాదాల్లో వాహన డ్యామేజీ, క్షతగాత్రులైన వారిని మేజర్, మైనర్ నాన్ ఇంజూరి అనే కేటగిరీలుగా విభజించి వివరాలను రికార్డు చేయాలన్నారు. ఎస్పీ అన్బురాజన్, కమిటీ మెంబర్, కన్వీనర్, డీటీసీ మీరా ప్రసాద్, ఆర్టీఓ సుశీల, ట్రాఫిక్ పోలీసు అధికారులు, ఎంవీఐలు, డీఎంహెచ్ఓ, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం రెట్టింపునకు కృషి

- బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్



మైదుకూరు : దేశంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తెలిపారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరులోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు, పనతల సురేష్, చంద్ర ఓబుళరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు

పోరుమామిళ్ల: ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షతన, పోరుమామిళ్ల తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 26న జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి నాయబ్‌రసూల్ తెలిపారు. పోరుమామిళ్లలోని సిరి ఫంక్షన్ హాలులో సబ్‌జూనియర్,క్యాడెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

MANAGEMENT SEATS AVAILABLE
B.P.T. B.Sc. AGRICULTURE
HOMEOPATHY
63090 41999, 93901 25466

పత్రికా విలువలను దిగజారుస్తున్న రామోజీ

- ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి
- ఈనాడు ప్రతిక ప్రతుల దహనం


బద్వేలు నాలుగు రోడ్ల కూడలిలో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి తదితరులు

బద్వేలు అర్బన్: చంద్రబాబు మెప్పు కోసం రామోజీ రావు జర్నలిజం, పత్రికా విలువలను దిగజారుస్తూ తప్పుడు కథనాలు ప్రచురించడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లడమే లక్ష్యంగా ఈనాడు పత్రికలో వస్తున్న తప్పుడు కథనాలను నిరసిస్తూ శుక్రవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రామోజీ రావు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు తప్పుడు కథనాలు ప్రచురిస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నేత పట్టాభిని పోలీసులు చిత్రహింసలు పెట్టారని రెండేళ్ల నాటి పాత ఫోటోలతో కథనాన్ని ప్రచురించడాన్ని జర్నలిజం అంటారా అని ప్రశ్నించారు. అంతేకాకుండా మాజీ మంత్రి వైఎస్‌వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డిపై ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో అసత్య కథనాలు రాస్తూ కేసులో ఇరికించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు రాస్తున్న తప్పుడు వార్తలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలే వారికి బుద్ధిచెబుతారని అన్నారు. అలాగే ఎన్ని విషపురాతలు రాసినా వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న ప్రజాభిమానాన్ని మార్చలేరని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళరాజగోపాల్‌రెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, అల్లాబకాష్, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మున్సిపాలిటీ కన్వీనర్ ఈగయద్దారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవిశ్రీరాములు, వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, జెడ్పీటీసీ పోలిరెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఆర్ఐవో రమణరాజు



కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఇంటర్మీడియట్ ఆర్ఐవో రమణరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది కూడా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను నాన్ జంబ్లింగ్ విధానంలోనే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకు రెండు దశల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరగుతాయన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 14,541 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారన్నారు. ఇందులో ఎంపీసీకి సంబంధించి 9648 మంది, బైపీసీకి సంబంధించి 4893 మంది రాయనున్నారన్నారు. ఇందుకోసం ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 101 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరగుతాయని చెప్పారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ప్రాక్టికల్స్ మొదటి విడత ఈనెల 26 నుంచి మార్చి 2 వరకు, రెండో విడత మార్చి 3 నుంచి 7వ తేదీ వరకు సెలవు దినాల్లో కూడా జరుగుతాయన్నారు. ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమును కూడా ఏర్పాటు చేశామన్నారు. సమస్యలుంటే 08562 244171 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆర్ఐవో తెలిపారు.



క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం

ముద్దనూరు : చింతకుంట గ్రామ సమీపంలోని ముద్దనూరు–తాడిపత్రి రహదారిలో ఉన్న చింతకుంట డాబా సమీంలో శుక్రవారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన 14 టెట్రా మద్యం ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని కలిగి ఉన్న బిల్లా సుబ్బరాయుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

స్కేటింగ్ చాంపియన్‌లుగా కడప క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–19 స్కేటింగ్ పోటీల్లో వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. అండర్–19 విభాగంలో జిల్లా క్రీడాకారులు 3 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యపతకాలు సాధించినట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి సి. శారద తెలిపారు. పతకాలు, ట్రోఫీలు సాధించిన క్రీడాకారులను ఆమె అభినందించారు.

ఎంత పని చేశావ్.. అమ్మా!

- కుమార్తెకు నిప్పంటించి, తానూ ఆత్మహత్యాయత్నం
- నెలల పాప మృతి
- తల్లి పరిస్థితి విషమం


కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయిషా


చిన్నారి అలీషా (ఫైల్)


ఆయిషా (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : వారిది చిన్న కుటుంబం.. భార్యాభర్తలు పని చేసుకొని జీవనం సాగించేవారు. ఏడాది వయస్సు గల పాపతో వారు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. సంతోషాలకు నిలయమైన ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. కుమార్తెను చంకనెత్తుకున్న ఆ తల్లి కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. ఈ సంఘటన ప్రొద్దుటూరులోని మోడంపల్లెలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. నాసిర్ మైదుకూరు రోడ్డులోని ఒక సూపర్ మార్కెట్‌లో పని చేస్తున్నాడు. అతనికి రెండేళ్ల క్రితం అనంతపురానికి చెందిన ఆయిషాతో వివాహం అయింది. వారికి 13 నెలల అలీషా అనే కుమార్తె ఉంది. పెళ్లి అయిన నాటి నుంచి భార్యా భర్తలు అన్యోన్యంగా ఉండేవారు. ఈ క్రమంలో గురువారం రాత్రి నసీర్ సూపర్ మార్కెట్ నుంచి ఇంటికి వచ్చాడు. భోజనం తిన్న తర్వాత భార్యాభర్తలు పడుకున్నారు. కొంత సేపటి తర్వాత ఆయిషా తన కుమార్తెను ఎత్తుకొని మొదటి అంతస్తునున్న గదిలోకి వెళ్లింది. అక్కడే ఉన్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకుంది. ఇంట్లో నుంచి మంటలు రావడంతో భర్త గట్టిగా కేకలు వేశాడు. స్థానికుల సహకారంతో భార్యా, కుమార్తెలను జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యుడు వారి పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించారు. అయితే కొద్ది సేపటి తర్వాత అలీషా (13 నెలలు) మృతి చెందింది. ఆయిషా శరీరం కూడా పూర్తిగా కాలిపోయింది. ఆమె పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

భర్తను అదుపులోకి తీసుకున్న పోలీసులు

సంఘటన జరిగిన వెంటనే భర్త నాసిర్‌ను టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటనపై అతన్ని ప్రశ్నించారు. తన భార్య ఎందుకు ఇలా చేసిందో తెలియదని చెబుతున్నాడు. తమకు ఎలాంటి సమస్యలు లేవని, గొడవలు కూడా తమ మధ్య ఉండేవి కావని అతను పోలీసులకు తెలిపాడు. కాగా పోలీసులు నాసిర్ నివాసం ఉంటున్న మోడంపల్లెకు వెళ్లి విచారించారు. భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారని చెప్పారు. నాసిర్‌ను చాలా ఏళ్ల చూస్తున్నామని, మంచి వ్యక్తి అని వారు పోలీసులతో అన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయిషా తన భర్త దేవుడు లాంటి వాడని పోలీసులకు తెలిపింది. తనను ఏమీ అనొద్దని, అతను మంచివాడని చెప్పింది. అనంతపురంలో ఉన్న ఆయిషా తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటన ఎందుకు జరిగిందో అర్థం కాక పోలీసులు సతమతమవుతున్నారు. టూ టౌన్ సీఐ ఇబ్రహీం శుక్రవారం ఉదయం రిమ్స్‌కు వెళ్లి పరిశీలించారు.

- శుభాకాంక్షలు





విజయవాడలోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఎస్. అబ్దుల్ నజీర్‌ను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

బహుళార్థ పశు వైద్యశాలలో విచారణ

డీడీతోపాటు ఏడీ, డాక్టర్‌ను విచారించిన కమిటీ


ఏడీ బెనర్జీని విచారణ చేస్తున్న కమిటీ సభ్యులు

కడప అగ్రికల్చర్ : కడప బహుళార్థ పశు వైద్యశాల(వీపీసీ)లోని డీడీ అచ్చన్నతోపాటు ఏడీ సుదీర్‌నాథ్‌బెనర్జీ, పశువైద్యాధికారి సుభాష్ చంద్రబోస్‌ను నెల్లూరు జిల్లా పశుసంవర్థశాఖ జేడీ మహేశ్వరుడు, కార్యాలయ సూపరింటెండెంట్ నాగమణి, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు శుక్రవారం విచారణ చేశారు. గతేడాది అక్టోబర్ 21న ఏడీ సుదీర్‌నాథ్‌బెనర్జీని డీడీ అచ్చన్న ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఈ విషయమై అప్పట్లో విచారణ చేశారు. తరువాత డాక్టర్ సుభాష్ చంద్రబోస్‌ను కూడా జనవరిలో సరెండర్ చేశారు. దీనిపై విచారణ చేయాల్సి ఉంది. అయితే ఇటీవల వీపీసీలో డీడీ, ఏడీల మధ్య వివాదం ఎక్కువై ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం, ప్రభుత్వానికి సరెండర్ చేయడం వంటి సంఘటనలు చోటు చేసుకోవడంతో.. ప్రభుత్వం కలగ చేసుకుని నిజనిర్ధారణ కోసం త్రిసభ్య కమిటీని నియమించింది. వారు వీసీపీని సందర్శించి విచారణ చేసి నివేదికలను ప్రభుత్వానికి అందించారు. దీంతో అప్పట్లో జరగాల్సిన విచారణ ఆగిపోయింది. దీంతో తిరిగి విచారణ కమిటీ శుక్రవారం వీసీపీని సందర్శించి డీడీ అచ్చన చాంబర్‌లో డీడీ అచ్చన్నతోపాటు ఏడీ బెనర్జీ, పశువైద్యాధికారి సుభాష్‌చంద్రబోస్‌ను విచారణ చేశారు. అలాగే కార్యాలయ సిబ్బందితోపాటు కొంత మంది పశుపోషకులతో మాట్లాడినట్లు తెలిసింది. ఈ విచారణకు సంబంధించిన నివేదికలను ఉన్నతాధికారులతోపాటు ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

వేంపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు(మోటివేషన్ క్లాస్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విజయకుమారి, ఖాజాపర్వీన్, వెంకటరమణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కపిల్ చిట్స్‌లో ఉద్యోగ అవకాశాలు

గమనిక: మార్కెటింగ్ ఆఫీసర్స్‌గా పనిచేయుటకు

ఇంటర్వ్యూ తేది: 26-02-2023వ తేది ఆదివారం, ఉదయం 9.00 గంIIల నుండి 11.30 గంIIల వరకు

ఇంటర్వ్యూ జరిగే స్థలం : ప్లాట్ నెం: MIG93, APHB కాలనీ, LIC Quarters Back side, Opp: విశ్వేశ్వరయ్య సర్కిల్, కడప Cont: 9948312025, 8096912489, 08562 - 254505

ఇంటర్వ్యూకి వచ్చేటప్పుడు, బయోడేటా, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, మార్కులిస్టు జిరాక్స్ కాపీలు మరియు Driving Licence Zerox Copy తప్పక తీసుకురావలెను.

పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలి


నేర సమీక్షలో పాల్గొన్న పోలీసు అధికారులు


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

నేర సమీక్షలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పెండింగ్‌లో వున్న కేసులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో ఎస్పీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన నేరాలలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై చార్జిషీటు దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తరచూ జరిగే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతోపాటు నిఘా పెంచాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ పూజిత నీలం, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జిల్లాలో వివిధ కేటగిరీలలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు.

- వివిధ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేయడంతోపాటు ఓ యువతిని కాపాడి తల్లిదండ్రులకు అప్పగించడంలో కీలకపాత్ర పోషించిన కమాండ్ కంట్రోల్ వ్యవస్థలో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లలో ఆరుగురికి ప్రశంసా పత్రాలు అందజేశారు.
- బాల్య వివాహాలు అరికట్టడం, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో మహిళా పోలీసుల సేవలు అభినందనీయమని ఎస్పీ తెలిపారు. తమ విధుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన 30 మంది మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు అందించారు.
- అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన కడప 'దిశ' సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. దిశ డీఎస్పీ ఆర్.వాసుదేవన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పి.సుధారాణి, కస్టమర్ సపోర్ట్ ఫర్ పెర్సొనల్‌గా పని చేస్తున్న సి.రమాదేవి, ఎ.నాగజ్యోతి అందుకున్నారు.

దేవదాయ భూముల లెక్క పక్కాగా ఉండాలి


మాట్లాడుతున్న జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ

కడప కల్చరల్ : జిల్లాలోని దేవదాయ భూముల విషయంలో సర్వే లెక్కలు పక్కాగా ఉండాలని జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.శంకర్‌బాలాజీ అన్నారు. శుక్రవారం కడపలోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన తనిఖీ అధికారులు, మండల కార్యనిర్వహణాధికారులు, కో ఆర్డినేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 36 మండలాల్లో దేవదాయశాఖ భూములు సుమారు 14,596.53 ఎకరాలు ఉన్నాయన్నారు. భూ సర్వేలో భాగంగా మండల కార్యనిర్వాహణ అధికారులు, మండల కో ఆర్డినేటర్లు దేవాలయాలకు సంబంధించిన అన్ని భూముల వివరాలు సంబంధిత మండల తహసీల్దార్‌కు ఫారం–ఏ ద్వారా అందజేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దేవదాయశాఖకు సంబంధించిన భూముల విషయంలో అన్ని మండలాల తహసీల్దార్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కనుక జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్యనిర్వాహణ అధికారులు సంబంధిత మండల తహసీల్దార్లకు ఫారం–ఏ రూపంలో జిల్లాలోని దేవదాయశాఖకు చెందిన అన్ని భూములు, తగిన రికార్డులు అందజేయాలన్నారు.

కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య

తొండూరు : మండలంలోని ఇనగలూరు గ్రామానికి చెందిన ఆనంద్‌కుమార్ (33) కడుపు నొప్పి తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆనంద్ కుమార్ కొన్ని రోజులుగా కడుపు నొప్పి తాళలేక బాధపడుతుండే వాడు. గతంలో గుండె పోటు రావడంతో స్టంట్ వేయించుకున్నాడు. దీంతో కొన్ని రోజుల నుంచి ఆరోగ్యం బాగలేదని మద్యం తాగుతుండే వాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య సుబ్బమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ హనుమంతు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ వాటర్ ప్లాంట్ ధ్వంసం

– టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని నాగిశెట్టిపల్లె పంచాయతీ నందిపల్లెలో ప్రభుత్వ వాటర్ ప్లాంట్‌ను స్థానిక టీడీపీ నాయకులు పి.రాజశేఖర్‌నాయుడు, లక్ష్మినాయుడు, వెంకటేశ్వర్లునాయుడు ధ్వంసం చేశారని సర్పంచ్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాకమల్లు అనంత్‌రెడ్డి మాట్లాడుతూ నందిపల్లెలో ఫ్లోరైడ్ నీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారని తెలిపారు. ఎంపీ నిధుల ద్వారా సర్వే నంబర్ 145 ప్రభుత్వ భూమిలో 2018న వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారని చెప్పారు. వారం రోజుల క్రితం ఆ స్థలం తనదంటూ రాజశేఖర్‌నాయుడు మరి కొంత మందితో కలిసి వాటర్ ప్లాంట్‌ను ధ్వంసం చేశారన్నారు. అక్కడ పరికరాలు కనిపించకుండా చేసి, ఆ స్థలాన్ని బుల్ డోజర్‌తో చదును చేయించారన్నారు. కనీసం తనకు, పంచాయతీ సెక్రటరీకి సమాచారం ఇవ్వకుండా ధ్వంసం చేయడంపై బి.మఠం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపినట్లు సర్పంచ్ వివరించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కమలాపురం : ఎర్రగుడిపాడు దళితవాడలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్, పోలీస్ అధికారులు అడ్డుకున్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ సుజామణి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగుడిపాడు దళితవాడకు చెందిన చీర్ల బాలయ్య అనే యువకుడు కమలాపురం పట్టణ పరిధిలోని పైడిమాను కాలనీకి చెందిన ఓ మైనర్ బాలికను వివాహం చేసుకోవాలని శుక్రవారం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న సీడీపీఓ సుజామణి, సూపర్‌వైజర్లు జయకుమారి, భారతి, పార్వతి, మహిళా పోలీస్ భూలక్ష్మీ, పోలీసులు ఎర్రగుడిపాడుకు చేరుకుని అడ్డుకున్నారు. ఇరు కుటుంబాల వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ నాగార్జునరెడ్డి, ఐసీడీఎస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడప లోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో శుక్రవారం హ్యాండ్‌బాల్ జిల్లాస్థాయి జూనియర్ బాలుర విభాగం (అండర్–19) ఎంపికలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కంభం చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులకు ఈనెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి ఎ. సింధూరి మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు మార్చి 3, 4, 5 తేదీల్లో కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.గౌరవ అతిథిగా విచ్చేసిన పోతుల ట్రస్టు చైర్మన్ పోతుల వెంకట్రామిరెడ్డి , జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కె.ఎస్. సమరనాథరెడ్డి, జియోన్ వ్యాయామ కళాశాల వ్యవస్థాపకులు కె. రాజారత్నం ఐజాక్ మాట్లాడారు. డీఎస్‌ఏ హ్యాండ్‌బాల్ కోచ్ మునాఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. రాజశేఖర్, సీనియర్ క్రీడాకారులు సాయికిశోర్‌రెడ్డి, శివప్రసాద్, రాజగోపాల్‌రెడ్డిలు సెలక్షన్ కమిటీ సభ్యులుగా జిల్లా జట్టుకు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు.

జిల్లా ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారులు..

చాంద్‌బాషా, ప్రతాప్, ఉదయ్‌కుమార్, విక్రమ్ కల్యాణ్, వెంకటశివకుమార్, వెంకటకృష్ణారెడ్డి, ఈశ్వర్, గురువర్ధన్, నాగేంద్ర, రజాక్, సునీల్‌రెడ్డి, ఆదర్శ్, సాయికిరణ్, విజయరాజ్, మోహన్‌నాయక్, ఆదిశేషారెడ్డి, విష్ణువర్ధన్, అబ్దుల్ రహీం, అక్బర్, ప్రసాద్, మురళీకృష్ణా, వెంకటశ్రీరామ్.

దేవస్థాన కమిటీ సభ్యులపై దాడి

వేంపల్లె : స్థానిక పుల్లయ్య తోటలోని శ్రీచౌడేశ్వరిదేవి దేవస్థానం కమిటీ సభ్యులపై ముగ్గురు వ్యక్తులు శుక్రవారం దాడికి దిగారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పుల్లయ్యతోట వీధిలో ఆ దేవస్థానానికి సంబంధించి 10 సెంట్ల స్థలం ఉంది. రక్షణ గోడ నిర్మించేందుకు కమిటీ సభ్యులు రాళ్లను తోలారు. బేల్దారులు నిర్మాణం చేసే క్రమంలో గాండ్ల వీధికి చెందిన ఏమిరెడ్డి కృష్ణారెడ్డి, నిరంజన్‌రెడ్డి, పురుషోత్తమరెడ్డి వారిని అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య మాటకుమాట పెరిగింది. ఈ క్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు కేశవులు, వీరాంజనేయులుపై వారు కొడవలితో దాడికి దిగారు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఏమిరెడ్డి కృష్ణారెడ్డి, నిరంజన్‌రెడ్డి, పురుషోత్తమరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణాలు దగ్ధం

పులివెందుల రూరల్ : పట్టణ పరిధి పార్నపల్లె రోడ్డులోని రాజారెడ్డి కాలనీ దగ్గర షార్ట్ స ర్క్యూట్‌తో ఒక సర్వీసింగ్ సెంటర్, టిఫిన్ సెంటర్ దగ్ధమయ్యాయి. రేకులు, కట్టెలతో కూడిన షెడ్లలో ఉన్న రజియా టిఫిన్ సెంటర్ వద్ద మా బాషా సర్వీసింగ్ సెంటర్ నడుపుతున్నారు. గు రువారం రాత్రి పనులు ముగించుకుని షాపు మూసి వెళ్లారు. తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. చుట్టు పక్కల వారు చూసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో.. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే సర్వీసింగ్, టిఫిన్ సెంటర్‌లతోపాటు వాటిలోని వస్తువులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు షాపు యజమానులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ చదువు మధ్యలో ఆపేసిన లేదా ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, Diploma, B.Tech, BCA, MCA, పాసయ్యే చాన్స్ కలదు. నాగేష్ అకాడమి, కడప. 7569470023 [G-6270]

ఉచిత శిక్షణతో ఉపాధి

■ గ్రామీణ నిరుద్యోగ యువతకు మూడు నెలల కాల వ్యవధిలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయం, అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు. Nihar Skill Education, Kadapa. 7013665112, 9059160549. [C-1161876]

REAL ESTATE

PLOTS FOR SALE

■ తిరుపతిలో స్థలం అమ్మకం.తుడా అప్రూవల్ కాబడి విమానాశ్రయానికి 28కి.మీ దూరంలో కాలు ష్యం లేని ఎలక్ట్రానిక్ హబ్‌లో TCL కంపెనీకి ఎదు రుగా 100అడుగులు రోడ్డు అనుకొని ఉన్న ప్లాట్లు అమ్మబడును. వాణిజ్య అవసరాలకు P.G. హాస్టలుకు, షాపు రూములకు & హోటల్ పెట్టుకోవడానికి అనుకూలం. ✆ 94401 68816, 9440248696. [T-656]

■ Plots for Sale Tirupati, Tuda Approved Located in Non-Polluting Electronic Hub, Opp. to TCL Company Facing 100 Ft Road is for Sale. Suitable for Commercial Space, Hotel, Shop Rooms, PG Hostel Home Stay etc. ✆ 9440168816, 9440248696. [T-657]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్, బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు వున్నవి, మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. 73821 14647 [V- 6077]

CHANGE OF NAME

■ I, BEDADURI SIVANJANEYULU R/o. 12-56, Virat Nagar, Acharla Colony, Proddatur, Kadapa Dist., AP. Now I change my name as BEDUDOORU SIVA ANJAJEYULU S/o. BEDUDOORU NARAYANA. [C-781410]

■ I, BEDADURI NARAYANA R/o. 12-56, Virat Nagar, Acharla Colony, Proddatur, Kadapa Dist., AP. Now I change my name as BEDUDOORU NARAYANA. [C-781411]

■ I, BEDADURI NARAYANAMMA R/o.12-56, Virat Nagar, Acharla Colony, Proddatur, Kadapa Dist., AP. Now I change my name as BEDUDOORU NARAYANAMMA W/o. BEDUDOORU NARAYANA. [C-781412]

HEALTH CARE

■ పల్లా హాస్పిటల్, 7 రోడ్ సర్కిల్ నందు ఆర్థోపెడిక్ మరియు గైనకాలజీ విభాగంలో ఉచిత OP శిబిరం: 28-02-2023 మంగళవారం, సమయం: 9.00 AM నుండి 1.30 PM గమనిక: రూ.2000/- విలువైన BMD బోన్ డెన్సిటీ టెస్ట్ ఉచితంగా మరియు సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచితంగా చేయబడుతుంది. ఈ శిబిరంలో: కీళ్లనొప్పులు, మోకాళ్ల నొప్పులు, సర్వైకల్ స్పాండిలైటిస్, లంబార్ స్పాండిలైటిస్, సయాటికా, కీళ్ల నొప్పులకు ఉచితంగా చూస్తారు. Ph: 9849040153 [H-796718]

WANTED

■ కడప జిల్లాలో వాక్లెట్స్, డ్రైఫ్రూట్స్ సేల్ చేయుటకు, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, అసిస్టెంట్ మేనేజర్స్ కావలెను. Age:35 below, అర్హత: 10 th- డిగ్రీ, జీతం: 12K-15K+ ఇన్సెంటివ్స్. సంII: 8500900870. [C-789362]

■ క్రాంతి ఫిల్లింగ్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో పెట్రోలు పట్టుటకు పంప్ బాయ్స్/గర్ల్స్ కావలెను. జీతం:11500/- నియర్ న్యూ RTC బస్టాండ్ దగ్గర, కడప. 9705826592. [C-789370]

■ కడప నందు పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Q: 6th పైన, వయస్సు: 25 సంIIలు పైన, జీతం: 10,000. 12 గంటలు డ్యూటీ, సంప్ర: 9703508754, 7095004007. [C-781409]

■ Amazonలో పనిచేయుటకు డెలివరీ బాయ్స్ కావలెను. కడప లోకల్ వారికి ప్రాధాన్యత. జీతం 10,000+2000+ఇన్సెంటివ్, టూ వీలర్, స్మార్ట్ ఫోన్ తప్పనిసరిగా ఉండవలెను. PENNA DELIVERY SERVICES. సంప్ర : 6305859950, 8309585872, 8374016893. [C-789351]

■ కడప టౌన్‌లోని ప్రముఖ కొరియర్ సంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్ మరియు డేటా ఎంట్రీ ఆపరేటర్ (F) కావలెను. సంప్ర: 9866226198, 9573264975. [C-789376]

■ మిడ్వెస్ట్ గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ – కడప సిద్ధవటం నందు పనిచేయుటకు మంచి అనుభవం కలిగిన "Excavator Machine" ఆపరేటర్స్ కావలెను. జీతం: 25,000+PF+ESI+ గ్రాట్యుటీ సదుపాయం కలదు. ఫోన్ : 9949406068. [HA-1034]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్ నర్సులు, వంటవారు, Rmp Dr. Q-5th-డిగ్రీ, 10-30 వేల జీతం, భో+రూం ఫ్రీ, Hyd. ఫోన్ : 7995365999 [HA-1030]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు, వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-9790]

■ ఉద్యోగాలు: S.R. నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో జాబ్ చేయుటకు యువతీ యువకులకు అవకాశం. అ: 10,ఇంటర్,డిగ్రీ (P/F). Age: 18 to 28. నో ఫీజు. సెల్: 9177342337. [WA-6483]

■ రాయచోటిలోని మోర్ సూపర్ మార్కెట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ : 11000/- 8H, EPF+ ESI కలవు. 9885295999, 9581952222 [G-396]

■ SSC/Inter /డిగ్రీ/ITI, డిప్లొమా,(P/F) అయ్యి ఖాళీగా ఉన్న 39 (స్త్రీ/పు.లు మా సంస్థలో పనిచేయుటకు కావలెను. జీ: 14 వేలు + DA 6 వేలు + ఫ్రీ రూం. ఫీజు లేదు. మోచంపేట, కడప. 97018 64175 [L-794959]


■ మదనపల్లె, చిత్తూరు నందు బాలాజీ సర్వీసెస్‌లో పనిచేయుటకు అనుభవం గల సేల్స్ ఎగ్జిక్యూటివ్,కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. సంప్ర: 8886664161, 9052067894. [T-4024]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781909]

■ ధరణికోట చరితరెడ్డి డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ (సిఆర్‌డిఏ) నందు పనిచేయుటకు PROలు కావలెను. సంప్ర: 9876983382, 9032329277 [G-781780]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010224479
9010223797
9705898007

ఆస్పత్రి వద్ద బాధితుల ఆందోళన

మగబిడ్డను ప్రసవించి మహిళా పోలీసు మృతి


ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు (ఇన్‌సెట్) స్వర్ణకుమారి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే కుమారుడిని చూడకనే కన్నుమూసింది. మహిళా పోలీసు స్వర్ణకుమారి (33) ఆస్పత్రిలో మగబిడ్డను ప్రసవించి కొద్ది సేపటి తర్వాత మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. బాధితులు, ఆస్పత్రి వర్గాలు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన బాబు చేనేత పని చేసుకొని జీవనం సాగించేవాడు. ఆయన భార్య స్వర్ణకుమారికి 2019లో కొండాపురం మండలంలోని చౌటపల్లె సచివాలయంలో మహిళా పోలీసుగా ఉద్యోగం వచ్చింది. దీంతో వారు కొండాపురం మండలానికి కాపురం మార్చారు. వారికి మొదటి కాన్పులో మగబిడ్డ జన్మించాడు. రెండో కాన్పు కోసం గురువారం ప్రొద్దుటూరులోని కాత్యా నర్సింగ్ హోంకు తీసుకెళ్లారు. డాక్టర్ సిజేరియన్ చేశాడు. మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆపరేషన్ తర్వాత ఆమెకు అధిక రక్తస్రావం జరిగింది. ముగ్గురు వైద్యులు కలిసి చికిత్స చేయడంతో రక్తస్రావం ఆగింది. కొద్ది సేపటి తర్వాత రెండో సారి బ్లీడింగ్(రక్తస్రావం) కావడంతో ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించారు. రెండు ఆపరేషన్ల కోసం సుమారు ఏడు యూనిట్ల రక్తాన్ని ఎక్కించాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. మూడో సారి రక్తస్రావమైతే ప్రమాదకరమని భావించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు వెళ్లాలని సూచించారు. గురువారం రాత్రి బెంగళూరుకు వెళ్తున్న సమయంలో పులివెందుల సమీపంలోకి వెళ్లగానే మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని ప్రొద్దుటూరులోని శ్రీరాంనగర్‌లో ఉంటున్న తమ బంధువుల ఇంటికి తీసుకొచ్చారు. స్వర్ణకుమారి బంధువులు శుక్రవారం ఉదయం ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. డాక్టర్ నిర్లక్ష్యంతోనే ఆమె మృతి చెందిందని ఆరోపించారు. విషయం తెలియడంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

మా నిర్లక్ష్యం లేదు

స్వర్ణకుమారి ఏడవ నెల వరకు వేరే ఆస్పత్రిలో చూపించుకున్నట్లు డాక్టర్ కాత్యా తెలిపారు. ఎనిమిదవ నెలలో తమ ఆస్పత్రికి వచ్చిన పరీక్షించగా మాయ కిందికి ఉండటంతో రిస్క్ ఎక్కువగా ఉంటుందని తెలిపామన్నారు. సిజేరియన్ చేసిన తర్వాత అధిక రక్తస్రావం కావడంతో, రెండో సారి ముగ్గురు వైద్యులు ఆపరేషన్ చేసి గర్భసంచిని తొలగించామన్నారు. మూడోసారి బ్లీడింగ్ అయితే ప్రమాదకరమని భావించి ముందు జాగ్రత్తగా బెంగళూరుకు వెళ్లాలని సూచించామని తెలిపారు. అక్కడికి వెళ్తున్న సమయంలో మార్గంమధ్యలో గుండె పోటు రావడంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఇందులో తమ నిర్లక్ష్యం ఏమీ లేదని, అన్ని జాగ్రత్తలు తీసుకునే ఆపరేషన్ చేశామని వివరించారు.

జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సీనియర్ విభాగం ఆర్చరీ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలకు వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల స్పెషలాఫీసర్ ఎస్. బాషామోహిద్దీన్, మాజీ ప్రత్యేకాధికారి డా. ఎం. రామచంద్రారెడ్డిలు అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాచీనక్రీడ విలువిద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. క్రీడాకారులు చక్కగా సాధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి. జనార్ధన్‌రెడ్డి, కార్యదర్శి ఆర్. తేజేంద్ర మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 28 నుంచి మార్చి 3వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్చరీ శిక్షకుడు రాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఇండియన్ విభాగం : వై.నవనీష్, జి. భాస్కర్, డి. నాగచైతన్య, కె. దీపిక.

కాంపౌండ్ విభాగం : పి.వి.సాయిశ్రీనివాస్, వి.చెన్నకేశవులు, బి.హేమంత్, బి. విష్ణువర్ధన్‌రెడ్డి.

రికర్వ్ విభాగం : వి.వి.అచ్యుతానందరెడ్డి, ఎస్. ఇంద్రకళ్యాణ్‌రెడ్డి, ఎం. వినయ్‌కుమార్, పి. కీర్తి.